ప్రజాశక్తి
శుక్రవారం 20 అక్టోబరు 2023 5
శ్రీకాకుళం



రేపు జెడ్‌పి స్థాయీ సంఘ సమావేశాలు



ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లా ప్రజా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలు ఈ నెల 21న నిర్వహించనున్నట్లు జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి ఆర్.వెంకటరామన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి 6వ స్థాయి, 11 గంటలకు 3వ స్థాయి, మధ్యాహ్నం 12 గంటలకు 5వ స్థాయి, 2 గంటలకు 2వ స్థాయి, 3 గంటలకు 4వ స్థాయి, సాయంత్రం 4 గంటలకు 7వ స్థాయి, 5 గంటలకు 1వ స్థాయీ సంఘ సమావేశం జరగనున్నట్లు వివరించారు.

'జలకళ' లేనట్టేనా?

- దరఖాస్తు చేసి మూడేళ్లవుతున్నా మంజూరు కాని బోర్లు
- ఇప్పటివరకు 5,714 మంది దరఖాస్తు
- 246 చోట్లే బోర్ల తవ్వకాలు
- 13 మంది రైతులకే విద్యుత్ కనెక్షన్లు

కోటబొమ్మాళి మండలం ఊడికలపాడులో ట్రాన్స్‌ఫార్మర్ వేసి కనెక్షన్ ఇవ్వని అధికారులు (ఫైల్)



ప్రభుత్వం ఘనంగా ప్రారంభించిన వైఎస్ఆర్ జలకళ పథకంపై ప్రస్తుతం నిలినీడలు కమ్ముకున్నాయి. జిల్లాలో సాగునీటి సౌకర్యం లేక వేలాది ఎకరాల భూములు నిరుపయోగంగానే ఉన్నాయి. ఆ భూముల్లో ఉచితంగా బోర్లు వేసి వాటిని వినియోగంలో తీసుకొస్తామంటూ వైసిపి ప్రభుత్వం మూడేళ్ల కిందట వైఎస్ఆర్ జలకళ పథకాన్ని తీసుకొచ్చింది. బోర్లతో పాటు విద్యుత్ కనెక్షనూ అందిస్తామని చెప్పడంతో రైతులు ఉత్సాహంగా దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తుల స్వీకరణ, సర్వే పూర్తి చేసి అర్హులైన వారికి అధికారులు అనుమతులు మంజూరు చేశారు. తొలుత పూర్తి ఖర్చు తామే భరిస్తామని ప్రభుత్వం చెప్పింది. తర్వాత రూ.2 లక్షల వరకు చెల్లిస్తామంటూ ఉత్తర్వులు జారీ చేసింది. అదనపు భారం పడుతున్నా రైతులకు అంగీకరించారు. అయినా ప్రభుత్వం నుంచి ఇప్పటివరకు స్పందించకపోవడంతో అసలు పథకం ఉందా? లేదా? అన్న సందేహం రైతుల్లో వ్యక్తమవుతోంది.

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

చిన్న సన్నకారు రైతులకు మేలు కలిగించేందుకు వైసిపి ప్రభుత్వం 2020, సెప్టెంబరు 28న ప్రారంభించింది. బోరు సౌకర్యం లేని 2.5 ఎకరాలు నుంచి ఐదు ఎకరాల వరకు ఉన్న రైతులను అర్హులుగా పేర్కొంది. బోర్ల తవ్వకం, విద్యుత్ కనెక్షన్లను ఉచితంగా ఇస్తామంటూ ప్రకటించింది. ప్రస్తుతం అందులో మార్పులు చేయడంతో అన్నదాతలు ఉసూరుమంటున్నారు. ఐదెకరాల్లోపు వారికి సైతం రూ.2 లక్షలోపు మాత్రమే విద్యుత్ కనెక్షన్ల ఖర్చు చేస్తామని, అంతకంటే ఎక్కువ అయితే రైతులే భరించాల్సి ఉంటుందని పేర్కొంది. అయినా రైతులు ఖర్చుకు వెనుకాడకుండా బోర్లు తవ్వించుకోవడానికి సిద్ధపడ్డారు. జిల్లాలో వైఎస్ఆర్ జలకళ పథకం కోసం మొత్తం 5,714 దరఖాస్తులు వచ్చాయి. వాటిలో 4690 దరఖాస్తులు అర్హమైనవిగా తేల్చారు. వాటిలో 2,299 చోట్ల సర్వే పూర్తి చేశారు. సర్వే పూర్తయిన వాటిలో 1057 ప్రాంతాల్లో బోర్ల తవ్వకాలకు అధికారులు అనుమతులు మంజూరు చేశారు. ఇప్పటివరకు 246 చోట్ల బోర్లు తవ్వారు. 229 ప్రాంతాల్లో నీళ్లు పడగా 17 చోట్ల నీరు పడలేదు. 13 మంది రైతుల పొలాలకు విద్యుత్ కనెక్షన్లు ఇచ్చారు

బోర్లు తవ్వినా విద్యుత్ కనెక్షన్లు ఇవ్వని వైనం

సాధారణంగా ఒక ట్రాన్స్‌ఫార్మర్, నాలుగు విద్యుత్ స్తంభాలు వేస్తే రూ.2 లక్షల అంచనా వ్యయం దాటిపోతుంది. లబ్ధిదారుల్లో ఎక్కువ మంది ఒకటి నుంచి రెండు కిలోమీటర్ల మేర స్తంభాలు వేయాల్సిన వారు ఉన్నారు. ట్రాన్స్‌ఫార్మర్‌తో కలిపితే వారికి రూ.5 నుంచి రూ.6 లక్షలు దాటిపోతోంది. ప్రభుత్వం కనీసం రూ.రెండు లక్షలు ఇచ్చినా మిగిలిన ఖర్చు భరించేందుకు రైతులు సిద్ధంగా ఉన్నారు. అయినా ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పందన కనిపించడం లేదు. ఐదెకరాల లోపు ఉన్న రైతులకు రూ.2 లక్షల వరకు విద్యుత్ కనెక్షన్ ఖర్చు ప్రభుత్వమే భరిస్తుందని చెప్పినా ఆ తర్వాత ఎవరికీ డబ్బులు చెల్లించలేదు. ఎక్కడా ఒక్క కనెక్షన్ ఇవ్వలేదు. కొన్నిచోట్ల విద్యుత్‌శాఖ కనెక్షన్లు ఇచ్చినా వాటికయినా ఖర్చునూ ప్రభుత్వం చెల్లించలేదని తెలుస్తోంది. ప్రభుత్వం విద్యుత్‌శాఖకు డబ్బులు ఇవ్వకపోవడంతో విద్యుత్‌శాఖ కనెక్షన్లను ఆపేసింది. దీంతో బోర్లు తవ్వి విడిచిపెట్టేయంతో మట్టి కూరుకుపోతోందని, త్వరగా తమకు విద్యుత్ సరఫరా అయ్యేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

నిధులు విడుదల చేయకపోవడం వల్లేనా?

చిన్న సన్నకారు రైతులను ఆదుకునేందుకు గతంలో ఇందిర జలప్రభ, ఎన్‌టిఆర్ జలసిరి పేర్లతో ప్రభుత్వాలు అమలు చేశాయి. వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత కొన్ని మార్పులు చేసి వైఎస్ఆర్ జలకళగా పేరు మార్చింది. బోర్లు, విద్యుత్ కనెక్షన్లు ఉచితంగా ఇస్తామని ప్రకటించడంతో రైతులు ఆశతో దరఖాస్తు చేసుకున్నారు. ప్రారంభం నుంచి పలు నిబంధనలు మార్చడం, గిట్టుబాటు కాక డ్రిల్లింగ్ ఏజెన్సీలు ముందుకు రాకపోవడం, నిధుల లేమి, బిల్లుల చెల్లింపుల్లో జాప్యం తదితర కారణాలతో పురోగతి కనిపించడం లేదు. జిల్లాలో ఎచ్చెర్ల, ఆమదాలవలస, పలాస నియోజకవర్గాల్లో మాత్రమే బోర్ల తవ్వకాలకు డ్రిల్లింగ్ ఏజెన్సీలు ముందుకు వచ్చాయి. ప్రభుత్వం చెల్లిస్తున్న ధర గిట్టుబాటు కావడం లేదంటూ మిగిలిన నియోజకవర్గాల్లో ఏజెన్సీలు ఆసక్తి చూపడం లేదు. వేల మంది రైతులు దరఖాస్తు చేసుకుంటే ఈ రెండేళ్లలో వందల సంఖ్యలోనే బోర్లు తవ్వారు. పదుల సంఖ్యలోనే విద్యుత్ కనెక్షన్లు ఇచ్చారు. బోర్ల కోసం తమ వంతు వాటాగా రైతులు భరించేందుకు సిద్ధంగా ఉన్నా... ప్రభుత్వం తరుపు నుంచి నిధులు విడుదల కాకపోవడంతో బోర్ల మంజూరు ప్రక్రియ నిలిచిపోయినట్లు తెలుస్తోంది.

జిపిఎస్‌ను అంగీకరించం

యుటిఎఫ్ ఆధ్వర్యాన నిరాహార దీక్ష



నిరాహార దీక్ష చేస్తున్న యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

సిపిఎస్, జిపిఎస్ విధానాలను అంగీకరించమని, పాతపెన్షన్ విధానాన్ని అమలు చేయాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి చౌదరి రవీంద్ర, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.అప్పారావు, ఎస్.కిషోర్ కుమార్ డిమాండ్ చేశారు. కలెక్టరేట్ వద్ద పాత పెన్షన్ సాధనకు యుటిఎఫ్ ఆధ్వర్యాన గురువారం నిరవధిక దీక్షలు ప్రారంభించారు. ఈ దీక్షలను యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి చౌదర్ రవీంద్ర, విశ్రాంత ఉప విద్యాశాఖ అధికారి కె.అప్పారావు, బి.మోహనరావు, కె.వైకుంఠరావు, బి.శ్రీరామ్మూర్తిలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాత పెన్షన్‌ను అమలు చేస్తే ఆర్థిక సంక్షోభం వస్తుందని ప్రజలకు ప్రభుత్వం మభ్యపెడుతోందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చెపుతున్న ఆర్థిక పరిస్థితిపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. వందేళ్ల వరకు ఆర్థికభారం అని చెప్పడాన్ని ఎద్దేవా చేశారు. జగన్మోహనరెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీ అమలు చేయకుండా దేశానికి ఆదర్శమని చెబుతున్న జిపిఎస్ విధానం తీసుకొస్తున్నారని అన్నారు. ఈ విధానం సిపిఎస్‌కి మరో రూపం తప్ప ప్రత్యామ్నాయం కాదని అన్నారు. 2024 ఎన్నికల్లో ఒపిఎస్ అమలు చేస్తామని చెప్పే పార్టీలకే ఉద్యోగం ఉపాధ్యాయ కుటుంబాల మద్దతు ఇస్తామని తెలిపారు. పాత పెన్షన్ అమలు చేసి ప్రజల పక్షాన ఉంటారా? జిపిఎస్ అమలు చేస్తామని కార్పొరేట్ల పక్షాన ఉంటారా? ప్రభుత్వం నిర్ణయించుకోవాలన్నారు. 33 ఏళ్ల సర్వీసు పూర్తి అయితేనే 50 శాతం పెన్షన్ ఇచ్చే జిపిఎస్ కాంట్రిబ్యూషన్ కట్టించుకుని జిపిఎస్ ఉద్యోగుల పాలిట మరణ శాసనం అవుతుందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం జిపిఎస్ కాకుండా ఒపిఎస్‌సి అమలు చేయాలని డిమాండ్ చేశారు. 19న ప్రారంభమైన దీక్షలు ఒపిఎస్ సాధించే వరకూ నిరవధికంగా కొనసాగుతాయని తెలియజేశారు. 20న పాత తాలూకా కేంద్రాల్లో నిరహార దీక్షలు చేపట్టనున్నట్లు తెలిపారు. దీక్షలో జిల్లా సహాధ్యక్షులు ఎల్.బాబూరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వై.ఉమాశంకర్, జిల్లా కార్యదర్శి సిపిఎస్ జిల్లా కన్వీనర్ జి.నారాయణరావు, జిల్లా నాయకులు పి.ఉమాభాస్కర్‌పాల్గొన్నారు. ఈ దీక్షకు మద్దతుగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు భవిరి కృష్ణమూర్తి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గంగరాపు సింహాచలం, పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు టి.తిరుపతిరావు, పంచాయతీరాజ్ మినిస్ట్రీ రియల్ నాయకులు కె.నారాయణరావు, బి.జయమ్మ, ఐలు నాయకులు బి.మోహనరావు, జె.వి.వి.నాయకులు, జి.గిరిధర్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి తేజేశ్వరరావు, పోస్టల్ యూనియన్ నాయకులు గణపతిరావు, డిటిఎఫ్ నాయకులు పూజారి హరిప్రసన్న సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో బి.ధనలక్ష్మి, హనుమంతు అన్నాజీరావు, జి.శ్రీరామచంద్రమూర్తి, పి.మురళీధరరావు, జి.కోదండరావు, కె.రమేష్‌కుమార్, కె.వెంకటరావు పాల్గొన్నారు.

విలువలతో కూడిన జర్నలిజం అవసరం

ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాసరావు



శ్రీనివాసరావు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

విలువలతో కూడిన జర్నలిజం అవసరమని ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు అన్నారు. జిల్లా పర్యటనలో భాగంగా అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయాన్ని గురువారం సందర్శించారు. అనంతరం ఆర్అండ్‌బి అతిథి గృహంలో విలేకరులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహనరెడ్డి ఉత్తరాంధ్ర అభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేస్తున్నారని అన్నారు. శరవేగంగా అభివృద్ధి చెందుతున్న నగరాల్లో విశాఖపట్నం ఒకటని, అందులో భాగంగా రాజధాని కేంద్రంగా విశాఖను అభివృద్ధి చేస్తున్నారని అన్నారు. జిల్లాలో మూలపేట పోర్టు నిర్మాణం శరవేగంగా సాగుతోందని, ఇప్పటికే 600 మీటర్ల మేర సముద్రంలోకి జెట్టీ మార్గం వేశారని ప్రభుత్వం నిర్మించిందని తెలి పారు. వచ్చే ఏడాది ఏప్రిల్ నాటికి మొదటి దశ పోర్టు పను లు పూర్తవుతాయన్నారు. మత్స్యకారుల వలసల నివారణకు ఈ పోర్టు ఉపయోగపడుతుందని చెప్పారు.

అర్హులందరికీ ఇళ్ల స్థలాలు

జర్నలిజాన్నే వృత్తిగా చేసుకొని, నిబద్ధతతో పనిచేస్తున్న జర్నలిస్టులకు సొంతింటి కల నేరవేర్చే దిశగా ముఖ్యమంత్రి చర్యలు తీసుకుంటున్నారని అన్నారు. రాష్ట్రంలో అర్హులై ఉండి, గతంలో ఎన్నడూ ఇంటి స్థలం గానీ, ఇళ్లు గానీ పొందని నిరుపేద జర్నలిస్టులకు కేటాయించనున్నట్టు తెలిపారు. సమాజంలో సముచితమైన గుర్తింపు, గౌరవం జర్నలిస్టులకు ఉంటుందన్నారు.

ప్రత్యేక బస్సుల్లో సాధారణ ఛార్జీలు

జిల్లా ప్రజా రవాణాశాఖ అధికారి విజయ్‌కుమార్



విజయ్‌కుమార్

శ్రీకాకుళం అర్బన్ : దూర ప్రాంతాల నుంచి సొంత ఊర్లకి వచ్చి, వెళ్లే ప్రయాణికుల సౌకర్యార్థం సాధారణ ఛార్జీలతో ఆర్‌టిసి అదనపు బస్సులు నడుపుతు న్నామని, ప్రజలందరూ ఈ సౌకర్యాన్ని వినియోగించుకో వాలని జిల్లా ప్రజా రవాణా అధికారి ఎ.విజయ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీకాకుళం నుంచి హైదరాబాద్, విజయవాడ, రాజమండ్రి, కాకినాడ, రావులపాలెం, అమలాపు రాలకూ ప్రత్యేక బస్సులు నడుపుతున్నామ అన్నారు. రెండు వైపులా ఒకేసారి ముందస్తుగా రిజర్వేషన్ చేసుకున్న ప్రయాణికులకు రానుపోనూ ప్రయాణపు ఛార్జీ మొత్తంలో 10 శాతం రాయితీ ఇస్తున్నట్లు తెలిపారు. విశాఖపట్నం ద్వారకా బస్‌స్టేషన్ నుంచి శ్రీకాకుళం మీదుగా ఇచ్ఛాపురం వరకు అన్ని గ్రామాలకూ ప్రతి 5 నిమిషాలకొక బస్సు సౌకర్యం ఉంటుందని అన్నారు. అన్ని బస్సు స్టేషన్లల్లో ప్రయాణికుల రద్దీకి సరిపడే బస్సులు నడిపేందుకు ఆర్‌టిసి అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారని చెప్పారు. ప్రయాణికులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా అన్ని చర్యలు తీసుకున్నామని అన్నారు. అధిక ధరలకు ప్రయివేటు బస్సులను ఆశ్రయించాల్సిన అవసరం లేదని అన్నారు. ప్రజాధరణ పొందిన ఆర్‌టిసి సౌకర్యవంతమైన ప్రయాణం అందిస్తుందని తెలిపారు. ఈ సదవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. భవానీ భక్తులు విజయవాడకు వెళ్లేందుకు ప్రత్యేక బస్సులు కోరినచో వారికీ ఏర్పాటు చేస్తామని అన్నారు. మరిన్ని వివరాలకు శ్రీకాకుళం-1 డిపో 995922 5608, శ్రీకాకుళం-2 డిపో 9959225609, టెక్కలి డిపో 9959225611, పలాస డిపో 9959225610 నంబర్లకు సంప్రదించాలని సూచించారు.

జగన్‌తోనే రాష్ట్రాభివృద్ధి

శాసనసభ స్పీకర్ సీతారాం



మాట్లాడుతున్న స్పీకర్ సీతారాం

ప్రజాశక్తి- ఆమదాలవలస

రాష్ట్రాభివృద్ధి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డితోనే సాధ్యమని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. పట్టణంలోని మార్కెట్ కమిటీ యార్డులో 'వై ఎపి నీడ్' జగన్ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ రంగాల్లోనూ రాష్ట్రం ప్రగతి పథంలో దూసుకుపోవాలన్నా, సంక్షేమ పథకాలు నిరంతరాయంగా కొనసాగాలన్నా వైసిపి గెలుపు అత్యంత ఆవశ్యమని అన్నారు. పార్టీ అధిష్టానం నిర్ణయం మేరకు వచ్చే నెల 1 నుంచి పది వరకు 'వై ఎపి నీడ్ జగన్' కార్యక్రమాన్ని వాడవాడలా నిర్వహించనున్నట్లు తెలిపారు. నాలుగున్నరేళ్ల నుంచి దళారీ వ్యవస్థ మాయమయ్యిందన్నారు. ప్రభుత్వ పథకాలను నేరుగా అర్హులైన లబ్ధిదారుల ఖాతాల్లో జమవుతుందని అన్నారు. గ్రామ సచివాలయ వ్యవస్థ ఏర్పాటు ద్వారా, వాలంటీర్ల వ్యవస్థ ప్రారంభించిన నాటి నుంచి పాలనలో పూర్తిస్థాయి పారదర్శకత ఏర్పడిందన్నారు. ప్రతి గ్రామంలోనూ గ్రామ వాలంటీర్లు ప్రభుత్వ లక్ష్యాలను, ఉద్దేశాలను ప్రజలకు వివరిస్తూ, అర్హులైన లబ్ధిదారులను గుర్తిస్తూ, ప్రభుత్వ పథకాలను నేరుగా చేరవేస్తున్నారన్నారు. దీనివల్ల లబ్ధిదారుడు ప్రభుత్వ లబ్ధిని పొందుతున్నారన్నారు. విద్య, వైద్యం, వ్యవసాయం, సంక్షేమం ఇలా ప్రతి రంగంలోనూ ప్రజలు కోరుకునే, ఆశించే ఫలితాలు లభిస్తాయన్న విషయాన్ని ప్రజలకు వివరించాలని దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమాన్ని మండలంలో విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యువజన విభాగ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవి నాగ్, ఎంపిపి ప్రతినిధి తమ్మినేని శ్రీరామ్మూర్తి, జెడ్‌పిటిసి బెండి గోవిందరావు, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బొడ్డేపల్లి రమేష్‌కుమార్, పిఎసిఎస్ అధ్యక్షులు గురుగుబెల్లి శ్రీనివాసరావు, అల్లంశెట్టి ఉమామహేశ్వరరావు, బొడ్డేపల్లి నారాయణరావు, గురుగుబెల్లి చలపతి, ఎన్ని రామచంద్రరావు, చల్ల సింహాచలం, దుంపల శ్యామలరావు, దుంపల చిరంజీవి పాల్గొన్నారు.



భరత్ నాయక్

పలాస ఆర్‌డిఒగా భరత్ నాయక్

పలాస: పలాస ఆర్‌డిఒగా ఎస్.భరత్ నాయక్ నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం గురువారం జిఒను విడుదల చేసింది. 2018లో నిర్వహించిన ఎపిపిఎస్‌సి గ్రూప్-1లో ఎంపికయ్యారు. చిత్తూరులో మూడు నెలలు, కర్నూలులో రెండున్నరేళ్ల పాటు ఎస్‌యుబి డిఎస్‌పిగా పనిచేశారు. 2022లో నిర్వహించిన గ్రూప్-1 పరీక్షలో మళ్లీ ఎంపికయ్యారు. ఏడాది పాటు ట్రైనింగ్ పూర్తి కావడంతో పలాస ఆర్‌డిఒగా ప్రభుత్వం నియమించింది. ఈయన అనంతపురం టౌన్‌కు చెందిన వారు. ఇప్పటి వరకు ఆర్‌డిఒగా పనిచేసిన టి.సీతారామ్మూర్తిని సాధారణ పరిపాలనా శాఖకు రిపోర్టు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. గతేడాది ఏప్రిల్ 2న ఏర్పడిన పలాస డివిజన్ తొలి ఆర్‌డిఒగా సీతారామ్మూర్తి పనిచేశారు.

జిల్లాలో 15,059 మందికి 'చేదోడు'

కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్



నమూనా చెక్కును అందజేస్తున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో 6,393 మంది రజకకు, 2,710 మంది నాయీబ్రాహ్మణులకు, 5,956 మంది దర్జీలకు రూ.15.05 కోట్ల నిధులు ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహనరెడ్డి బటన్ నొక్కి వారి ఖాతాలకు జమ చేస్తున్నట్టు కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ తెలిపారు. గురువారం జిల్లాలో జగనన్న చేదోడు పథకం ద్వారా లబ్ధిదారులకు నిధులు విడుదల చేశారు. ఇందులో భాగంగా కలెక్టరేట్‌లోని కలెక్టర్ నమూనా చెక్కును విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆమదాలవలస నియోజకవర్గంలో 2,094 మందికి, ఎచ్చెర్లలో 2,210 మందికి, ఇచ్ఛాపురంలో 1,610 మంది, నరసన్నపేటలో 2,172 మందికి, పలాసలో 1,340 మందికి, పాతపట్నంలో 1,590 మందికి, శ్రీకాకుళంలో 2,235 మందికి, టెక్కలి నియోజకవర్గంలో 1,808 మంది లబ్ధిదారులకు ప్రయోజనం చేకూరుతుందని వివరించారు. కార్యక్రమంలో జిల్లాకు చెందిన నాయీబ్రాహ్మణ లబ్ధిదారులు పి.రామకృష్ణ, కొయ్యాపు పోలోడు, దర్జీ లబ్ధిదారులు వై.ఆదిలక్ష్మి, టి.పాపారావు, ఎన్.సుకన్య, రజక లబ్ధిదారులు ఎస్.రాజేష్, ఎస్.గీత, గౌరి, కళింగ కోమటి కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు, పొందర కూరాకుల కార్పొరేషన్ చైర్‌పర్సన్ రాజాపు హైమావతి, వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ గంగు శారద, బిసి కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆర్.గడ్డెమ్మ పాల్గొన్నారు.

జాతీయస్థాయిలో రాణించాలి

ఎస్‌పి జి.ఆర్ రాధిక



ప్రశంసాపత్రం అందజేస్తున్న ఎస్‌పి రాధిక

ప్రజాశక్తి- శ్రీకాకుళం

రాష్ట్రస్థాయిలో యోగాలో రాణించిన విధంగా జాతీయస్థాయిలో రాణించాలని ఎస్‌పి జి.ఆర్.రాధిక పేర్కొన్నారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో ఈ నెల 14,15 తేదీల్లో జరిగిన రాష్ట్రస్థాయి 36వ యోగాసనం ఛాంపియన్ షిప్ పోటీల్లో జిల్లాలోని ఇచ్ఛాపురానికి చెందిన మహంతి శ్రీకాంత్ మొదటి స్థానంలో, సాయి జగదీష్ ఐదు స్థానంలోను ప్రతిభను కనబరిచి జాతీయస్థాయి యోగాసనానికి ఎంపికయ్యారు. ఈ మేరకు గురువారం శ్రీకాంత్, యోగ ట్రైనర్ హిమలు ఎస్‌పిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ జాతీయస్థాయిలో జరగనున్న యోగాసనాలలోనూ రాణించి జిల్లాలోని మరికొందరుని పిల్లలు, యువతి, యువకులు యోగాలో రాణించే విధంగా తీర్చిదిద్దాలన్నారు. యోగ అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిందని, రోజూ జిల్లా ప్రజలు యోగ కోసం కొంత సమయాన్ని కేటాయించి ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించారు.

సామాజిక యాత్రతో మరోసారి మోసం

టిడిపి జిల్లా అధ్యక్షులు రవికుమార్



మాట్లాడుతున్న రవికుమార్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టి రూ.వేల కోట్లు వెనకేసుకున్న సిఎం జగన్మోహన్‌రెడ్డి సామాజిక న్యాయం పేరుతో మరోమారు ప్రజలకు మోసం చేసేందుకు సిద్ధమవుతున్నారని, వైసిపి చేస్తున్న ఈ యాత్ర ఆ పార్టీని ప్రజలు సాగనంపే శవయాత్ర అవుతుందని టిడిపి జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్ ధ్వజమెత్తారు. టిడిపి జిల్లా కార్యాలయంలో గురువారం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో బిసిలకు రాజ్యాధికారాన్ని అందించింది టిడిపినేని అన్నారు. వైసిపి అధికారంలో వచ్చిన తర్వాత బిసిలపై పెత్తనం చెలాయిస్తున్న నలుగురు రీజనల్ కో-ఆర్డినేటర్లు, సకల శాఖల మంత్రి రెడ్డులు కాదా? అని ప్రశ్నించారు. ఢిల్లీ నడిబొడ్డున తెలుగు ప్రజల ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టారని అన్నారు. తెలుగు వారి ఆత్మగౌరవాన్ని కాపాడడానికే పుట్టింది టిడిపి అని చెప్పారు. బిసిల, దళితుల కోసం రెసిడెన్సియల్ పాఠశాలలు ఏర్పాటు చేసింది టిడిపి అని అన్నారు. పశుసంవర్ధకశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు చదువుకున్నది ఆ పాఠశాలలోనేనని గుర్తుచేశారు. టిడిపి రాకముందు మత్స్యకారులకు స్థితిగతులు ఏంటో మీ నాన్నను అడిగి తెలుసుకోవాలని మంత్రికి సూచించారు. ఈ నాలుగున్నరేళ్లలో మత్స్యకారులకు వైసిపి ప్రభుత్వం ఏంచేసిందో చెప్పాలని డిమాండ్ చేశారు. పలాస కొండలను గుండు గీయించి నేరాలు చేయడం తప్ప ప్రజలకు ఏం చేశావో చెప్పాలన్నారు. మంత్రులు ధర్మాన ప్రసాదరావు, బొత్స సత్యనారాయణ కాంగ్రెస్ పార్టీ నాయకులుగా ఉన్నప్పుడు ఏం మాట్లాడారో గుర్తు చేసుకోవాలన్నారు. చంద్రబాబును విమర్శించే నైతికత వారికి లేదని అన్నారు. సమావేశంలో టిడిపి అధికార ప్రతినిధి ముద్దాడ కృష్ణమూర్తినాయుడు, ఉపాధ్యక్షులు పి.ఎం.జె.బాబు, తమ్మినేని చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.


గ్రామ సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

సచివాలయ వ్యవస్థతోనే గ్రామ స్వరాజ్యం

ప్రజాశక్తి- లావేరు

సచివాలయ వ్యవస్థతోనే గ్రామ స్వరాజ్యం పాలనను సిఎం జగన్మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టారని విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ అన్నారు. మండలంలోని బుడుమూరులో ఉపాధిహామీ పథకం నిధులు రూ40 లక్షలతో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో ఎక్కడ ఇంతవరకు కనీవినీ ఎరుగని రీతిలో ఈ వ్యవస్థను ప్రవేశపెట్టిన ఘనత సిఎంకే దక్కుతుందన్నారు రైతుభరోసా కేంద్రాల ద్వారా రైతులకు సేవలు అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి రొక్కం బాలకృష్ణ, జెడ్‌పిటిసి మీసాల సీతంనాయుడు, ఎంపిడిఒ కుప్పలి సురేష్ కుమార్, పిఆర్ డిఇఇ సీతంనాయుడు, ఇఒపిఆర్‌డి వి.విశ్వేశ్వరరావు, వైస్‌ఎంపిపి లుకలాపు శ్రీనువాసురావు తదితరులు పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్ పోటీలకు అంపైర్‌గా శరత్

ప్రజాశక్తి- కవిటి


శరత్

అక్టోబర్ 19 నుంచి 24 వరకు గోవాలో జరగనున్న జాతీయ క్రీడల్లో బ్యాడ్మింటన్ పోటీలకు ఉషోదయ బ్యాట్మెంటన్ సంఘం సభ్యుడు తుంగాన శరత్ అంపైర్‌గా వ్యవహరించనున్నట్టు రాష్ట్ర బ్యాట్మెంటన్ అసోసియేషన్ నుంచి ఉత్తర్వులు అందాయని జిల్లా బ్యాట్మెంటన్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు తమరాల జయరాం తెలిపారు. ఈ సందర్భంగా శరత్ ఎంపికకు కృషి చేసిన జిల్లా బ్యాట్మెంటన్ అసోసియేషన్ అధ్యక్షుడు కిల్లంశెట్టి సాగర్, కార్యదర్శి మెట్ట అశోక్, సిఇఒ సంపతిరావు సూరిబాబు, సీనియర్ ఉపాధ్యక్షుడు బైరి దామోదర్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అలాగే జాతీయ స్థాయి పోటీలకు అంపైర్‌గా వ్యవహరించనున్న కవిటి గ్రామానికి చెందిన శరత్‌కు స్థానిక సర్పంచ్ పూడి లక్ష్మణరావు, బెందాలం చిట్టిబాబు, లోల్ల రాజేష్, బెందాలం రమేష్, ఆరింగి మధు, పాండవ చంద్రశేఖర్, పొలాయి లక్ష్మణమూర్తి, బెందాలం రంగారావు తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి- టెక్కలి


ఎంపికైన విద్యార్థులు

ఈ నెల 20 నుంచి 22 వరకు చిత్తూరు జిల్లా యండమూరి పట్టణంలో జరగనున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రస్థాయి జూనియర్ బాలుర, బాలికల ఖోఖో పోటీలకు మండలంలోని చాకిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న వాన చరణ్, బొంగు లహరిలు ఎంపికయ్యారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.అసురాధ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాస్థాయి పోటీల్లో ఎంపికైన వీరు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం పట్ల కృషి చేసిన వ్యాయామ ఉపాధ్యాయులు బాడాన నారాయణరావు, విద్యార్థులను ప్రధానోపాధ్యాయులతో పాటు ఉపాధ్యాయులు కురమాన దాలయ్య, పొట్నూరు జగదీష్, కాపల నారాయణరావు, పి.చిన్నారావు, బి.అనందరావు, ఆర్.జ్యోతి అభినందించారు.

29న 'కొన్నా' మెమోరియల్ స్పోర్ట్స్ మీట్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఏటా జిల్లాలో నిర్వహించే క్రీడోత్సవాల్లో కొన్న చిన్నారావు మెమోరియల్ జిల్లాస్థాయి అథ్లెటిక్స్, త్రైకాండో ఛాంపియన్ షిప్-23 పోటీలను ఈ నెల 29న నిర్వహించనున్నట్లు మెమోరియల్ సభ్యులు కొన్న సత్యనారాయణ, కొన్న వెంకటేశ్వరరావు (వాసు), కొన్న మధుసూదనరావు, ప్రగడ అశోక్‌కుమార్, పూడి బాలాదిత్య ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల మైదానం వేదికగా జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ సహకారంతో ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. దశాబ్దానికి పైగా నుంచి కొన్న చిన్నారావు కుటుంబ సభ్యులు క్రీడాకారులను ప్రోత్సహించడంకు ఏటా క్రీడాపోటీలను నిర్వహిస్తున్నారు. అథ్లెటిక్స్, త్రైకాండోలో ఛాంపియన్ షిప్ పోటీల్లో నాలుగు విభాగాలు ఉంటాయన్నారు. అథ్లెటిక్స్‌లో అండర్-14, 16, 18, 20 విభాగాల్లో బాలబాలికలకు వేర్వేరుగా 100 మీటర్లు, 400, 800, 2వేలు, 3 వేలు, 5 వేల మీటర్ల పరుగు పందాలు, లాంగ్‌జంప్, హైజంప్, షాట్‌పుట్, జావెలిన్‌తో తదితర ఈవెంట్‌లలో పోటీలను నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నారన్నారు. అలాగే త్రైకాండోలో సబ్ జూనియర్స్‌లో 13 వెయింగ్స్, కేడెట్‌లో 10, జూనియర్స్‌లో 10, సీనియర్స్‌లో 8 వెయింగ్స్‌లో బాలబాలికలకు పోటీలను నిర్వహించిన విజేతలకు బహుమతులు అందజేస్తామని ప్రకటించారు. పోటీల్లో పాల్గొన దలచిన వారు జిల్లా అథ్లెటిక్స్ సంఘ ప్రధాన కార్యదర్శి, పీడీ ఎం.సాంబమూర్తి 8500271575 సెల్ నంబరును సంప్రదించాలని కోరారు.


సచివాలయ సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న అధికారులు

కార్మికులుగా నమోదు చేసుకోవాలి

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

అసంఘటిత కార్మికులు తమ పేర్లు ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కాశీబుగ్గ అసిస్టెంట్ లేబర్ అధికారి ఎం.విజయకుమార్ కోరారు. గురువారం మంచినీళ్లపేట, పల్లివూరు, పెద్దబొడ్డపాడు, నగరంపల్లి సచివాలయాలను సందర్శించి కార్మికుల నమోదుపై సచివాలయం సిబ్బందికి పలు సూచనలు చేశారు. దీనికోసం 16 నుంచి 59 ఏళ్ల వయసు వారు నమోదు చేసుకోవచ్చన్నారు. సమీపంలోని కార్మికశాఖ కార్యాలయం, కామన్ సర్వీసు సెంటర్‌లోనూ నమోదు చేసుకోవచ్చన్నారు. అసంఘటిత కార్మికులకు గుర్తింపు కార్డు అందివ్వడంతో పాటు ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన పథకానికి అర్హులన్నారు. సచివాలయం పరిధిలోని అసంఘటిత కార్మికులకు సమాచారం అందించి పేర్లు నమోదు చేసుకోవడానికి అవగాహన కలిగించాలని సూచించారు. దీనికి సంబంధించిన సమాచారం నోటీసు బోర్డులో ఉంచారు. సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

జిఎన్‌ఎంలో ప్రవేశాలకు గడువు పెంపు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిఎన్‌ఎం కోర్సులో ప్రవేశానికి ఎపి డైరెక్టరేట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డిఎంఇ) వారు ఈ నెల 27వరకు గడువు పెంచారని బొల్లినేని మెడిస్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సిహెచ్.నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సునకు ఇంటర్‌లో ఏ గ్రూపు చదివిన విద్యార్థులైనా అర్హులన్నారు. డిప్లమో, బిఎస్‌సి పారా మెడికల్, నర్సింగ్ కోర్సుల్లో అడ్మిషన్లు జరుగుతున్నాయన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు బొల్లినేని మెడిస్కిల్స్, జెమ్స్ ప్రాంగణం, రాగోలు, శ్రీకాకుళం, 7680945357, 9121999654 సెల్ నంబర్లను సంప్రదించాలని సూచించారు. తమ కళాశాలలో ఈ కోర్సు పూర్తి చేసినవారికి కార్పొరేట్ ఆస్పత్రులలో ఉద్యోగాలు కల్పిస్తామని తెలిపారు.

'ఆరోగ్య సురక్ష'తో ప్రజల చెంతకు వైద్యం


స్టాల్‌ను పరిశీలిస్తున్న స్పీకర్ సీతారాం


సీమంతాలు చేస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

ప్రజాశక్తి- ఆమదాలవలస

జగనన్న సురక్షతో ప్రజల వద్దకే వైద్య సేవలు వస్తున్నాయని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. గురువారం మండలంలోని వంజంగి గ్రామంలో జగనన్న సురక్ష వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. వైద్య శిబిరంలో రోగులకు అందుతున్న వైద్య సేవల తీరు తెన్నులను పరిశీలించారు. వైద్య శిబిరంలో ఏర్పాటు చేసిన పలు విభాగాల స్టాల్స్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ ఒక్కరు వైద్యానికి దూరం కాకుండా ఉండాలన్నదే ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఉద్దేశమన్నారు. అనారోగ్యంతో అధిక డబ్బులు ఖర్చుపెట్టి ప్రజలు ఆర్థికంగా చితికిపోకూడదన్న ఉద్దేశంతోనే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రభుత్వం గ్రామాల్లో నిర్వహిస్తుందన్నారు. ఆరోగ్యకర గ్రామాల కోసం జగనన్న సురక్ష వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. అంగన్వాడీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్‌ను పరిశీలించి శిబిరానికి వచ్చే గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు, రక్తహీనతతో బాధపడుతున్న వారికి అవగాహన కల్పించాలన్నారు. ఈ సందర్భంగా జగనన్న ఆరోగ్య కిట్లను అందజేశారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి తమ్మినేని శ్రీరామ్మూర్తి, జెడ్‌పిటిసి బెండి గోవిందరావు, ఎంపిడిఒ ఎస్. వాసుదేవరావు, మాస్ మీడియా అధికారి పైడి వెంకటరమణ, వైద్యాధికారి బాలచందర్, వైద్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నరసన్నపేట: మండలం రావులవలస గ్రామ సచివాలయం పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి జిల్లా పార్టీ అధ్యక్షులు, నరసన్నపేట శాసనసభ్యులు ధర్మాన కృష్ణదాస్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి ఆరంగి మురళీధర్, పొందర కార్పొరేషన్ చైర్మన్ రాజాపు హైమావతి అప్పన్న, డాక్టర్ సెల్ అధ్యక్షుడు ముద్దాడ బాల భూపాల్ నాయుడు, మాజీ పిఎసిఎస్ అధ్యక్షులు సురంగి నర్సింగరావు, మండలం పార్టీ అధ్యక్షుడు లుకలాపు రవి కుమార్‌తో పాటు మండల వైసిపి నాయకులు, కార్యకర్తలు, వైద్యులు, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

నందిగాం: నందిగాం మండలం పెద్ద తామరపల్లి సచివాలయ పరిధిలో సర్పంచ్ ప్రతినిధి తమిరి దేవేంద్రరావు ఆధ్వర్యంలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని రాష్ట్ర కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్, ఎంపిపి నడుపూరు శ్రీరామమూర్తితో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ శివప్రసాద్, డిప్యూటీ తహశీల్దార్ ధనలక్ష్మి, ఎంపిటిసి సైలాడ లావన్య, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు చిన్ని జోగారావు యాదవ్, సుభద్రపురం సర్పంచ్ బోరుభద్ర సోమేశ్వరారావు, స్థానిక ఉపసర్పంచ్ టొంప రామారావు, తమరి షణ్ముఖరావు, జీరు లక్ష్మణరావు, రట్టి నాగరాజు సచివాలయ సిబ్బంది, వైద్య సిబ్బంది, వాలంటీర్స్ పాల్గొన్నారు.

మెళియాపుట్టి: మండలంలోని జాడుపల్లి గ్రామంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే రెడ్డి శాంతి పాల్గొన్నారు. ఐసిడిఎస్ ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించారు. గర్భిణీ స్త్రీలకు సీమంతాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ చంద్రకుమారి, డిటి టి. శంకరరావు, ఎంఇఒ ఎం.పద్మనాభం, ఎంపిపి ప్రతినిధి బి.ఉదయ్ కుమార్, పిఎసిఎస్ అధ్యక్షులు ఉర్లాప బాలరాజు, వైద్యాధికారులు హేమంతలక్ష్మి, పావని, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు: నగరంపల్లిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ ప్రాథమిక పరపతి సంఘం అధ్యక్షులు దువ్వాడ మధుకేశ్వరరావు, వైసిపి నాయకులు శిస్టు గౌతమ్, ఎంపిటిసి ప్రతినిధి బి.మోహనరావు, నీలరావు హరికృష్ణ, ఎంపిడిఒ ఈశ్వరమ్మ, ఇఒపిఆర్‌డి తిరుమలరావు, వైద్యులు దువ్వాడ దివ్య, తానిస్క్ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పలాస: మండలంలో టెక్కలిపట్నంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షులు పైల వెంకటరావు(చిట్టి), ఎంపిపి ప్రతినిధి ఉంగ సాయికృష్ణ, ఎంపిడిఒ రమేష్‌నాయుడు, ఇఒపిఆర్‌డి మెట్ట వైకుంఠరావు, ఐసిడిఎస్ పిఒ డి. శార్వాణి, మండల సచివాలయ కన్వీనరు దువ్వాడ రవికుమార్, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు కొర్ల సంతోష్‌కుమార్ పాల్గొన్నారు. అలాగే పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలో తాళభద్ర గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, కమిషనర్ నాగేంద్రకుమార్, ఎఇ అవినాష్, వైసిపి నాయకులు డబ్బీరు నాగ భూషణరావు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సంత బొమ్మాళి: ఆర్‌హెచ్ పురంలో సర్పంచ్‌లు జోగి రాములమ్మ, ఎన్ని మన్మథరావు ఆధ్వర్యంలో ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్, కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి, జెడ్‌పిటిసి పాల వసంత రెడ్డి, నందిగాం, కోటబొమ్మాళి ఎంపిపిలు నడుపూరు శ్రీరామమూర్తి, రోనంకి మల్లయ్య, మండల పార్టీ కన్వీనర్ జీరు బాబురావు, చిన్ని జోగారావు యాదవ్, ఎంపిటిసి రాజు, అప్పలనాయుడు, సర్పంచ్‌లు నక్కిట్ల అప్పన్న, భూషణ్ రెడ్డి, వెంకటరావు, నాగభూషణం, మన్మధరావు పాల్గొన్నారు.

పొందూరు: మండలం అచ్చిపోలవలస గ్రామంలో కింతలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన సుమారు 386 మందికి వైద్య పరీక్షలు జరిపి మందులను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ చంద్రమణి, వైసిపి మండల జెసిఎస్ బాడాన వెంకట కృష్ణారావు, ఎంపిడిఒ సీపాన హరిహరరావు, ఇఒపిఆర్‌డి సింహాచలం, వైసిపి నాయకులు శేఖర్, వైద్యాధికారులు శివశంకర్, రమేష్‌నాయుడు, సిహెచ్‌ఒ వాణికుమారి, ఎమ్ఎల్‌హెచ్‌పి శృతి, వైద్య సిబ్బంది, అంగన్వాడీ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

రణస్థలం రూరల్: మండల కేంద్రం జెఆర్.పురం-2 గ్రామ సచివాలయం పరిధిలో గరికిపాలెం గ్రామంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ పాల్గొన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి, మండల ఎంపిపి ప్రతినిధి పిన్నింటి సాయికుమార్, జెడ్‌పిటిసి టొంపల సీతారాం, మండల పార్టీ అధ్యక్షులు మహంతి పెద్దరామునాయుడు, జెసిఎస్ ఇన్‌ఛార్జి చిల్ల వెంకటరెడ్డి, వైస్ ఎంపిపి రాయపురెడ్డి బుజ్జి, వైస్ ఎంపిపి ప్రతినిధి మైలపల్లి కామరాజు, మండల మహిళా అధ్యక్షురాలు గురాన మానస, జెఆర్.పురం సర్పంచ్ భవిరి రమణ, నాయకులు నజ్మాభాను, కరిమజ్జి భూషణ్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ధర్మాన కృష్ణదాస్


శిబిరాన్ని పరిశీలిస్తున్న జెడ్‌పి చైర్‌పర్సన్ విజయ

కవిటి: కవిటి మండలం బల్లిపుట్టుగ గ్రామంలో గురువారం జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో జెడ్‌పి చైర్‌పర్సన్ విజయ పాల్గొన్నారు. ఐసిడిఎస్ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్ పరిశీలించి సంతప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శ్రీకన్య దొళై, ఎఎంసి మాజీ వైస్ చైర్మన్ రజనీ కుమార్ దొళై, వజ్జ గోపి, ఎంపిడిఒ సూర్యనారాయణ రెడ్డి, తహసీల్దార్ పి శేఖర్ పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: మండలంలో నీలంపేట గ్రామ సచివాలయ పరిధిలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో మండల పరిషత్ అధ్యక్షుడు రోణంకి ఉమామల్లేశ్వరరావు పాల్గొన్నారు. వైద్యులు డి. నీరజ, మనీష, ప్రీతి, జోత్స్న, సురేష్, నితీష్‌కుమార్‌లు 491 మంది పలు రకాల పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అలాగే డిఎంహెచ్‌ఒ బమ్మిడి మీనాక్షి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని పరిశీలించి వైద్యులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చి రోగులకు మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ కె. ఫణీంద్రకుమార్, డిటి ఆర్.మధు, ఇఒపిఆర్‌డి బొడ్డేపల్లి రామారావు, రాష్ట్ర కళింగ కర్పోరేషన్ డైరెక్టర్ సంపతిరావు హేమసుందరరాజు, సర్పంచ్‌లు శ్రీనివాస్, ఈశ్వరమ్మ, సింహాచలం, ఎంపిటిసి చెంచులు పాల్గొన్నారు.

'కొత్తమ్మతల్లి'కి ప్రముఖుల తాకిడి

కోటబొమ్మాళి: కొత్తమ్మతల్లిని స్పీకర్ తమ్మినేని సీతారాం, మంత్రి సీదిరి అప్పలరాజు దంపతులు, రాష్ట్ర కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్‌లు గురువారం దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కార్యనిర్వాహాధికారి వాకచర్ల రాధాకృష్ణ, ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ బోయిన మాధవి కృష్ణారావులు స్వాగతం పలకగా వేదపురోహితులు సుసరాపు గణపతిశర్మ, లక్ష్మీకాంతం శర్మలు పూర్ణకుంభంతో వేదమంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్, స్థానిక జూనియర్ సివిల్ జడ్జి డి. భరణిలు కొత్తమ్మతల్లిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. కాగా శ్రీకాకుళంకు చెందిన ప్రముఖ వైద్యులు డాక్టర్ దానేటి శ్రీధర్ అమ్మవారిని అదర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారికి వితరణగా రూ. లక్ష నగదును అందజేశారు. ఈ కార్యక్రమంలో సంతబొమ్మాళి జెడ్‌పిటిసి పాల వసంతరెడ్డి, ఎంపిపిలు రోణంకి ఉమామల్లేశ్వరరావు, ఎన్. శ్రీరామ్మూర్తి, కళింగ కార్పోరేషన్ డైరెక్టర్ హేమసుందరరాజు, పిఎసిఎస్ అధ్యక్షుడు బాడాన మురళి, టెక్కలి సిఐ సూర్యచంద్రమౌళి, కోటబొమ్మాళి ఎస్ఐ షేక్ మహ్మద్‌అలీ, వైఎస్ ఎంపిపిలు బోయిన నాగేశ్వరరావు, దుక్క రోజారామకృష్ణ, సర్పంచ్ కాళ్ల సంజీవరావు పాల్గొన్నారు.


పట్టువస్త్రాలను అందజేస్తున్న స్పీకర్ సీతారాం దంపతులు

ముగిసిన ఉత్సవాలు

స్థానిక శ్రీ కొత్తమ్మతల్లి జాతర ఉత్సవాలు అంబరాన్ని తాకాయి. మంగళవారం నుండి గురువారం వరకు మూడు రోజులు పాటు జరిగిన ఈ ఉత్సావాలు చివరి రోజైన గురువారం అత్యంత వైభవంగా ముగిసాయి. వేలాది సంఖ్యలో కొత్తమ్మతల్లిని దర్శించుకోని మొక్కులు తీర్చుకున్నారు. కొత్తపేట జంక్షన్ నుండి కోటబొమ్మాళి వరకు రెండు కిలోమీటర్లు దారి పొడవున రద్దీ ఉండడంతో పాదచారులు, వాహనదారులు నానా అవస్థలు పడ్డారు. పోలీస్ శాఖ ట్రాఫిక్ కంట్రోల్ చేయడానికి పలు చోట్ల వాహనాలను పార్కింగ్ చేయించారు. రెడ్డిక వీధిలో గల కమ్మకట్టు చిన్నఅప్పలస్వామి ఇంటి నుండి అమ్మవారి జంగిడిని పోలీసులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు మధ్య ఊరేగింపుగా వచ్చి అమ్మవారి దండకం చదివి చల్లదనం చేసారు. రైసు మిల్లర్ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నసంతర్పణలో వేలాది మంది యాత్రికులు పాల్గొన్నారు.

పోలీస్ సేవలు భేష్ : జాతర సందర్భంగా పోలీసులు అందించిన సేవల పట్ల భక్తులు పోలీస్ శాఖకు మంచి కితాబు ఇచ్చారు. టెక్కలి సిఐ సూర్యచంద్రమౌళి ఆధ్వర్యంలో కోటబొమ్మాళి ఎస్ఐ షేక్ మహ్మద్‌అలీ పర్యవేక్షణలో సుమారు 400 మంది పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. కొత్తమ్మతల్లి ఆలయ ప్రాంగణంలో పోలీస్ కంట్రోల్‌రూం ఏర్పాటు చేసి గ్రామమంతా సిసి కెమెరాలు, డ్రోన్‌లు ఏర్పాటు చేసి సిఐ ఎప్పటికప్పుడు పరిస్థితి తెలుసుకోని సిబ్బందిని అప్రమత్తం చేసారు. దీంతో ఎక్కడ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా జాగ్రత్తలు తీసుకున్నారు.


డిపో వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు

ఆర్‌టిసి కార్మికుల ధర్నా

టెక్కలిరూరల్: కార్మికుల సమస్యలను పరిష్కరించాలని, లేదంటే ఉద్యమం ఉధృతం చేస్తామని నేషనల్ మజ్దూర్ యూనియన్ రీజనల్ కార్యదర్శి వై.అప్పయ్య అన్నారు. గురువారం స్థానిక డిపో వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒఆర్ తక్కువ వస్తుందని చెప్పి ఒక డిపో బస్సును మరొక డిపో కార్మికులతో తీయస్తున్నారని తెలిపారు. ఇంక్రిమెంట్లు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అన్ని రకాల సెలవులపై జీతాలు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో బసవల ధనుంజయరావు, వి.కె.దేవ్, ఆర్.కె.రావు, ఎం.ఎస్.చలం, రమేష్, కె.బి.రావు, కిరణ్ కుమార్, ప్రసాద్ పాల్గొన్నారు.

అభివృద్ధి నిరోధకుడు జగన్

టిడిపి జిల్లా అధ్యక్షుడు రవికుమార్

ప్రజాశక్తి- ఆమదాలవలస

అభివృద్ధి నిరోధకుడు ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డిని రాష్ట్రం నుండి తరిమి కొట్టాల్సిన సమయం ఆసన్నమైందని టిడిపి జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్ అన్నారు. గురువారం పురపాలక సంఘ పరిధిలోని మెట్టక్కివలసలోని కుప్పిలివారివీధి, చిన్నబజార్‌లో బాబుతో నేను కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి కరపత్రాలను పంచుతూ వైసిపి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించారు.అనంతరం మాట్లాడుతూ రాష్ట్రంలో అరాచక ప్రభుత్వాన్ని నిరంతరం ప్రశ్నిస్తూ ప్రజల భవిష్యత్తుకు గ్యారెంటీని ఇస్తూ నిత్యం ప్రజల మధ్య ఉన్న చంద్రబాబును అర్ధరాత్రి వేళ అనాగరికంగా అరెస్టు చేసిన విధానాన్ని రాష్ట్ర ప్రజలందరూ చూశారని అన్నారు. రాజకీయ కక్షతో అక్రమ కేసు పెట్టారన్నారు. బాబుతో నేను కార్యక్రమంలో భాగంగా చంద్రబాబు నాయుడుకు మద్దతుగా ప్రజల నుండి 9261292612 నెంబర్‌కు మిస్డ్‌కాల్ ప్రజల చరవాణి నుండి ఇప్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మొదలవలస రమేష్, లంక నాగరాజు, నాగళ్ల మురళీధర్, బోర గోవిందరావు, ఇంజరాపు విశ్వనాథం, తంగి గురయ్య, కూన రమేష్, అన్నెపు సూరిబాబు పాల్గొన్నారు.


ఆమదాలవలస : కరపత్రాలను పంచుతున్న రవికుమార్

పొందూరు: మండలం తాడివలస గ్రామంలో చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టును నిరసిస్తూ టిడిపి నాయకులు గురువారం బాబుతో నేను కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక, అరాచక విధానాలను ప్రజలకు వివరిస్తూ ఇంటింటా కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తమ్మినేని మనెమ్మ, పాల్గున, భాస్కరరావు, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

'హ్యాపీనెస్' కోర్సు అవసరం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

సమాజంలో ఉన్నత స్థితిలో జీవించడానికి హ్యాపీనెస్ కోర్సు అవసరమని ఆర్ట్ ఆఫ్ లీవింగ్ జిల్లా ప్రతినిధి డాక్టర్ కింజరాపు అమ్మన్నాయుడు అన్నారు. నగరంలోని బలగలో ఆదిత్య విద్యానిలయంలో హ్యాపీనెస్ కోర్సు గురువారం ముగిసిన సభలో పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా అమ్మన్నాయుడు, చిట్టి జనార్ధన్‌దాస్ మాట్లాడుతూ నిత్య సాధనతో ఒత్తిడి లేని మనసు, ఆరోగ్యవంతమైన జీవితాన్ని పొందవచ్చని అన్నారు. డిడిసి సభ్యులు బి.వి.రవిశంకర్ మాట్లాడుతూ శారీరక, మానసిక ఆరోగ్యానికి ప్రతిఒక్కరూ ఆనందోత్సవ కోర్సు చేయాలన్నారు. అనంతరం అమ్మన్నాయుడు, టీచర్ సురేంద్రలను సన్మానించారు. కార్యక్రమంలో ఆదిత్య విద్యానిలయం ప్రిన్సిపాల్ దేసూళ రమేష్‌బాబు, కరెస్పాండంట్ చిట్టి రాము, చౌదరి శ్రీనివాసరావు, గేదెల ఉమాదేవి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అమ్మన్నాయుడు

688.7 సెంటీమీటర్ల వర్షపాతం నమోదు

ఆమదాలవలస: ఇప్పటివరకు నైరుతి రుతుపవనాల వలన జిల్లాలో జూన్ నుండి సెప్టెంబర్ వరకు 696.4 సెంటీమీటర్లు సాధారణ వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా, 688.7 సెంటీమీటర్లు వర్షపాతం నమోదైందని కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ కె.భాగ్యలక్ష్మి, వాతావరణ విభాగ శాస్త్రవేత్త డాక్టర్ బి.మౌనిక జిల్లాలోని వర్షపాత వివరాలను ఒక ప్రకటనలో తెలిపారు. వ్యత్యాసం 1.1 సెంటీమీటర్లు అతి తక్కువగా ఉందన్నారు. మొత్తం 35 రోజులు వర్షపు దినాలు నమోదు కావడం జరిగిందన్నారు. జిల్లాలోని ప్రధాన పంటలైన వరి, మొక్కజొన్న, చెరకు, వేరుశెనగ తదితర పంటలు వివిధ దశల్లో ఉన్నాయని తెలిపారు. భారత వాతావరణ విభాగం సూచనలు మేరకు అక్టోబర్ మాసంలో కూడా తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఏర్పడి పొడితో కూడిన వేడి వాతావరణం ఉండేందుకు అవకాశం ఉండటం వలన పంటలకు నీటి తడులు అందించడం, నేలపై పర్ధాలు కప్పి ఉంచడం చేసుకోవాలని తెలిపారు. నీటి వసతి లేనియెడల (13-0-45) అనే పోషక మిశ్రమాన్ని ఐదు గ్రాములు లీటర్ నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి. అలాగే యూరియా 10 నుండి 20 గ్రాములు మీటరు నీటికి కలిపి పిచికారీ చేసినట్లయితే బెట్ట పరిస్థితుల నుంచి ఉపశమనం కలిగే అవకాశం ఉందని తెలిపారు. గురువారం నైరుతి రుతుపవనాలు దేశం మొత్తం ఉపసంహరించుకున్నాయని మరొక మూడు రోజుల సమయంలో ఈశాన్య రుతుపవనాలు ప్రవేశించే అవకాశం ఉన్నదని తెలిపారు. దీని ప్రభావంతో మొదటి దశలో చిరుజల్లులు వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని తెలిపారు.

తూర్పుకాపులను బిసి-ఎలో చేర్చాలి

ప్రజాశక్తి- కొత్తూరు

తూర్పు.కాపులను బిసి 'ఎ' లో చేర్చాలని మండలంలోని తూర్పు కాపులంతా ఒక్కటై గురువారం స్థానిక గోగుల కాంప్లెక్ నుంచి నాలుగు రోడ్ల కూడలి వరకు ర్యాలీ నిర్వహించి అంబేద్కర్ విగ్రహం వద్ద మనవహారంగా.ఏర్పడి నినాదాలు చేశారు. ర్యాలీగా తహశీల్దార్ కార్యాలయానికి చేరుకుని తహశీల్దార్ ఎం.చక్రవర్తికి మెమోరాండం అందజేశారు. పార్టీలకు అతీతంగా నాయకులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో లోతుగెడ్డ తులసీ వర ప్రసాదరావు, కోయిలాపు శ్రీనివాసరావు, అగతముడి రంజిత్ కుమార్, చోడవరపు రాము, కర్నెన రమణ, పొగిరి రవి, ఎల్.తాత బాబు, చోడవరపు వెంకటరమణ, బానోజీరావు పాల్గొన్నారు.


ర్యాలీ నిర్వహిస్తున్న తూర్పుకాపులు

డయాలసిస్ కేంద్రానికి కృషి చేయాలి

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

మండలంలో కొత్తగా నిర్మించిన ప్రభుత్వా ఆస్పత్రిలో డయాలిసిస్ కేంద్రం ఏర్పాటుకు కృషి చేయాల్సిన అవసరం ఉందని ఈదిపురం సర్పంచ్ నర్తు వరప్రసాద్ కోరారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వైస్ చైర్మన్‌లు దున్న గురుమూర్తి, వివేకానంద రెడ్డి అధ్యక్షతన సాధారణ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి అనివార్య కారణాల వల్ల ఎంపిపి రాకపోవడంతో వైస్ చైర్మన్‌లు అధ్యక్షత వహించారు. సమావేశంలో శాఖల వారీగా సమీక్షా జరిగింది. ఇచ్ఛాపురం ప్రాంతంలో రోజు రోజుకీ కిడ్నీ వ్యాధిగ్రస్తులు పెరుగుతున్నారని, వారికి అనువుగా ఉండే ఈదూపురం ఆస్పత్రిలో డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేస్తే ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని కొలిగామ్ డాక్టర్ రేవతి దృష్టికి తీసుకొచ్చారు. జలజీవన మిషన్ పేరుతో పైపులైన్ కోసం రోడ్డుకు ఇరువైపుల తవ్వకాలు చెయ్యడంతో రోడ్లు దెబ్బతిన్నాయని మాజీ ఎంపిపి దక్కద ఏకాంభరి అన్నారు. జెఇ వంశీ సమాధానం ఇస్తూ రెండో ఫేజ్‌లో తవ్విన రోడ్లు బాగు చెయ్యడం జరుగుతుందన్నారు. తొందరలో స్టడీ ఎడ్యుకేషన్ అనాలిసిస్ సర్వ్ చెయ్యడం జరుగుతుందని విద్యాశాఖాధికారి అప్పారావు తెలిపారు. వెలుగు ఎపిఎం ప్రసాదరావు మహిళా సంఘాలు, ప్రభుత్వ పథకాలు, వలన కలిగే ఉపయోగాలపై అవగాహన కల్పించారు. సమావేశంలో ఎంపిడిఒ ఈశ్వరరావు, జెడ్‌పిటిసి ఉప్పాడ నారాయణమ్మ పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న వైస్ ఎంపిపిలు

'సజ్జల'ను కలిసిన గాంధీ

ప్రజాశక్తి- ఆమదాలవలస


రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణా రెడ్డిని వైసిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి, నియోజకవర్గ సీనియర్ నాయకులు సువ్వారి గాంధీ మర్యాద పూర్వకంగా కలసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకు వెళ్లినట్లు తెలిపారు. అలాగే నియోజకవర్గంలో ప్రస్తుతం ఉన్న పార్టీ స్థితిగతులను పరిస్థితులను ఆయనకు వివరించినట్లు తెలిపారు.


రామకృష్ణకు పుష్పగుచ్ఛాన్ని అందజేస్తున్న గాంధీ

టిపిఒగా అప్పలరాజు

ప్రజాశక్తి- పలాస

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ టౌన్ ప్లానింగ్ అధికారిగా ను వ్వల అప్పలరాజు గురువారం ఉ ద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఈయన గతంలో శ్రీకాకుళం మున్సిపాలిటీలో టిపిఎస్‌గా పని చేస్తూ ఉద్యోగోన్నతిపై పలాస మున్సిపాలిటీలో టిపిఒగా వచ్చారు. గతంలో పలాస మున్సిపాలిటీలో టిపిఒగా పని చేసిన సీతారాం తాడేపల్లిగూడెం మున్సిపాలిటీలో అసిస్టెంట్ సిటిప్లానర్ అధికారిగా బదిలీపై వెళ్లారు. మున్సిపల్ చైర్మన్ గిరిబాబు, కమిషనర్ నాగేంద్ర కుమార్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు.


నియామక పత్రాలను అందిస్తున్న కమిషనర్

పోస్టల్‌లో తత్కాల్ సేవలు నిలిపివేత

ప్రజాశక్తి- టెక్కలి

టెక్కలి పోస్టాఫీస్‌లో రైల్వే రిజర్వేషన్ టికెట్‌లు పొందే తత్కాల్ సేవలు నిలిచిపోయాయి. మూడు నెలలుగా సేవలు నిలిచిపోవడం పట్ల పలువురు రైల్వే ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తుంది. గతంలో పోస్టల్ కార్యాలయంలో రైల్వే రిజర్వేషన్ తత్కాల్ బుకింగ్ ఉండేది. దీనివలన చాలా మంది రైల్వే ప్రయాణికులు టెక్కలి వచ్చి దూర ప్రాంతాల ప్రయాణాలకు తత్కాల్ ద్వారా రైల్వే రిజర్వేషన్ చేయించుకునే సౌలభ్యం ఉండేది. కానీ పోస్టల్ కార్యాలయంలో ఉన్న తత్కాల్ రిజర్వేషన్ కౌంటర్‌లో ఉన్న సిపియు మరామ్మతుకు గురికావడంతో తత్కాల్ రిజర్వేషన్ సేవలు నిలిచిపోయాయి. మరామ్మతుకు గురైన సిపియు స్దానంలో మరోక పరికరం కావాలని పోస్టల్ శాఖా కార్యాలయ ఆధికారులు రైల్వే ఆధికారుల దృష్టికి తీసుకువచ్చినా రైల్వే శాఖాధికారులు మౌనం దాల్చడంలో గల ఆంతర్యం అంతు చిక్కడం లేదు. డివిజన్, నియోజకవర్గ కేంద్రమైన టెక్కలిలో రైల్వే తత్కాల్ కేంద్రం మూతబడడం పట్ల పలువురు రైల్వే ప్రయాణీకులు రిజర్వేషన్ కోసం ఇటు పలాస గానీ, నౌపడా జంక్షన్‌కుగానీ వెల్లాల్సిన పరిస్దితులు వస్తున్నా ఆక్కడ కూడా తత్కాల్ సౌకర్యంను పొందలేక పోతున్నారు. టెక్కలి పోస్టల్ కార్యాలయంలో ఉన్న తత్కాల్ కేంద్రం అందుబాటులో ఉంచకపోవడానికి గల కారణాలు తెలియరావడం లేదు. టెక్కలి కేంద్రంలో ఉన్న వారికి రైల్వే ప్రయాణం ఆందుబాటులో ఉండడానికి తత్కాల్ కేంద్రం అనువైనప్పటికీ వాటి సేవలు నిలిచిపోవడం వలన ప్రయాణీకులు తీవ్ర ఆసౌకర్యానికి గురవుతున్నారు. టెక్కలి పోస్టల్ కార్యాలయంలో ఉన్న తత్కాల్ కేంద్రం వలన టెక్కలి పట్టణంతో పాటు సంతబోమ్మాళి, నందిగాం మండలాలకు చెందిన రైల్వే ప్రయాణికులకు కూడా ఆందుబాటులో ఉండేది. ఇప్పటికైనా ఎంపి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, రైల్వే ఉన్నతస్థాయి ఆధికారుల దృష్టి సారించి టెక్కలి పోస్టల్ కార్యాలయంలో ఉన్న తత్కాల్ సేవల్ని మరలా కల్పించాలని కోరుతున్నారు.


పనులను పరిశీలిస్తున్న చైర్మన్, కమిషనర్

దీపావళి నాటికి రోడ్డు విస్తరణ పనులు పూర్తి

ప్రజాశక్తి- పలాస

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ కెటి రోడ్డు విస్తరణ పనులు త్వరతగతిన జరుగుతున్నాయని, ఇప్పటికే 80శాతం పనులు పూర్తి చేయడం జరిగిందని పలాస మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు తెలిపారు. గురువారం కె.టి రోడ్డు విస్తరణ పనులను కమిషనర్ టి.నాగేంద్ర కుమార్‌తో కలిసి ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ఇప్పటికే విద్యుత్‌కు సంబంధించిన పనులు పూర్తి చేసినప్పటికి, చిన్న చిన్న సమస్యలను మరో రెండు రోజుల్లో పూర్తిస్థాయిలో పూర్తి చేయడం జరుగుతుందన్నారు. తారురోడ్డు వేసేందుకు పనులు వేగవంతంగా జరుగుతున్నాయని, దీపావళి నాటికి పనులు పూర్తి చేసి పట్టణ ప్రజలకు కానుకగా ఇస్తామన్నారు. ఆయనతో పాటు డిఇఇ సునీల్ కుమార్, ఎఇ అవినాష్, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.



బహుమతి అందిస్తున్న పవర్ గ్రిడ్ కార్పొరేషన్ జనరల్ మేనేజర్

విద్యుత్ వినియోగంపై 'ఐతమ్'లో సదస్సు

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

టెక్కలి ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్మెంట్ ఇంజినీరింగ్ కళాశాల ఇఇఇ విభాగం విద్యార్థులకు విజిలెన్స్ అవగాహన వారోత్సవాల్లో భాగంగా వర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా పలాస ఆధ్వర్యంలో గురువారం అవగాహనా సదస్సు నిర్వహించినట్టు కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా 'అవినీతిరహిత ఇండియా' అనే అంశంపై వక్తృత్వపోటీ నిర్వహించగా 40 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వీరిలో అత్యంత ప్రతిభ కనపర్చిన నలుగురికి ప్రశంసాపత్రం, బహుమతులను పవర్ గ్రిడ్ కార్పొరేషన్ పలాస డిప్యూటీ జనరల్ మేనేజర్ రామచంద్రన్, చీఫ్ మేనేజర్ పవన్ కుమార్, జూనియర్ ఇంజినీర్ కె.రఘుపతిరావు, ఐతమ్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, ఇఇఇ హెచ్‌డి డాక్టర్ కె.కిరణ్ కుమార్ అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ పి. గురువులు నాయుడు పాల్గొన్నారు.

సరస్వతీదేవి సైకత శిల్పం

ప్రజాశక్తి- ఆమదాలవలస

దసరా నవరాత్రుల సందర్భంగా ఆరో రోజు సకల విద్యల కళామతల్లి సరస్వతీ దేవికి శుభాకాంక్షలు తెలుపుతూ సైకత శిల్పి గేదెల హరికృష్ణ మండలంలోని సంగమయ్య కొండ దిగువ భాగాన గాజుల కొల్లివలస వద్ద రూపొందించిన సైతక శిల్పాన్ని ప్రజలు చూసేందుకు చేరుకొని సైతక శిల్పి హరికృష్ణకు పలువురు శుభాకాంక్షలు తెలపారు.


హరికృష్ణ వేసిన సైకత శిల్పం

అనధికార ఎత్తిపోతలతోనే శివారుకు సాగునీటి కష్టాలు

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

వంశధార ఎగువ భాగంలో అనధికార ఎత్తిపోతల నిర్మాణంతోనే వంశధార శివారు ప్రాంతాలు సాగునీటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని వైసిపి సర్పంచ్‌లు అట్టాడ గోపి, టి. వరదరాజులు, అంబటి శ్రీను, బత్తిన ప్రసాదరావు, ఎంపిటిసి బాలక శ్రీనివాసరావు అన్నారు. గురువారం సైనూరులో విలేకరులతో మాట్లాడారు. గత టిడిపి హయాంలో వంశధార కాలువలో సాగునీరు ప్రవాహం అంచనా లేకుండా లిఫ్టులు నిర్మాణం వలనే దిగువ ప్రాంతంలో ఈ దుస్థితి అన్నారు. అప్పటి మంత్రి అచ్చెన్నాయుడు ఇష్టారాజ్యంగా లిఫ్టల నిర్మాణం చేస్తుంటే అప్పటి పలాస ఎమ్మెల్యే శివాజీ మౌనమునిలా మిగిలిపోయారని విమర్శించారు. ఆనాటి పాలకుల వైఫల్యం రైతులకు శాపంగా మారిందన్నారు. మంత్రి అప్పలరాజు కృషితో మదన గోపాలసాగరం వద్ద కాలువకు బైపాస్ నిర్మాణం కోసం అంచనాలు తయారు చేసారని, ఆ పనులు పూర్తి అయితే శివారుకు సాగునీటి ఇబ్బందులు పూర్తిగా తొలగిపోతాయన్నారు. సమావేశంలో కొల్లి జోగారావు, దాసరి దాలయ్య, జల్లు ఉషారాణి పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచ్‌లు

ఎస్‌టి కమిషన్ చైర్మన్ చొరవతో తాగునీటికి మోక్షం


కాలుష్య బావితో గ్రామ గిరిజనులు

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండలంలో భరణికోట పంచాయతీ జక్కరవీధి గ్రామ గిరిజనులు తాగునీటి సమస్యతో కొన్నేళ్లుగా ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలో ఉండే తాగునీటి బావి నీటి కాలుష్యానికి గురవడంతో ఈ నీటిని తాగుతూ ఇబ్బందులు పడుతున్నారు. పలుమార్లు అధికారులు, ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లిన ఫలితం లేకుండా పోయింది. గ్రామస్తుల సమస్యను దండకారణ్య జిల్లా అధ్యక్షులు సవర కుమార్ ఎస్టి కమిషన్ చైర్మన్ డివిజి శంకరరావు దష్టికి తీసుకువెళ్లారు. ఈ మేరకు చైర్మన్ స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సీతంపేట ఐటిడిఎ ప్రాజెక్టు అధికారికి ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు కొద్ది రోజులుగా గ్రామస్తులకు సురక్షితమైన తాగునీరు అందించేందుకు చర్యలు చేపట్టారు. ఇందుకు సంబంధించి తాగునీటి పైపులు, వాటర్ ట్యాంక్ సిద్ధం చేశారు. తాగునీటి సమస్యకు పరిష్కారానికి చర్యలు తీసుకున్న ఎస్టీ కమిషన్ చైర్మన్‌కు గ్రామస్తులు డిఎల్‌డిఒ జిల్లా అధ్యక్షులు సవర కుమార్ కృతజ్ఞతలు తెలిపారు.


సిద్ధం చేసిన తాగునీటి సామగ్రి

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండలం లో మర్రిపాడు మురికింటిభద్ర, జర్రిభద్ర గ్రామాల్లో గురువారం ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కార్యక్రమం చేపట్టారు. వరిలో రసం పీల్చే పురుగులు, లద్దె పురుగులు నివారణకు ముందస్తు చర్యగా తీసుకోవలసిన చర్యలపై అవగాహన కల్పించారు. పంచ పత్ర కషాయం 20 లీటర్లు తయారు చేసే విధానంపై రైతులకు వివరించారు. పంటలో రసం పీల్చే పురుగులు, లద్దె పురుగుల నివారణకు మంచి ఫలితం వస్తుందన్నారు. కార్యక్రమంలో ఎన్ఎఫ్ ఎండి సంజీవరావు, ఎల్‌టి నీలిమ, ఐసిఆర్‌పిలు రజిని, కూర్మారావు, ధర్మారావు పాల్గొన్నారు.


పంచపత్ర కషాయాన్ని తయారు చేస్తున్న సిబ్బంది

పంట పొలాలు పరిశీలన

ప్రజాశక్తి- నందిగాం

మండలంలోని నౌగాం,బెళ్లుకొల, మదనాపురం గ్రామాల్లో వర్షాభావ పరిస్థితుల వలన ఏ మేరకు పంట పాడైపోయిందో అంచనా వేసేందుకు జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ సహాయ సంచాలకులు కె.కృష్ణారావు, సిహెచ్ వెంకటరావు, టెక్కలి వ్యవసాయ సహాయ సంచాలకులు పి.వి. తిరుపతిరావు, నందిగాం వ్యవసాయాధికారి శ్రీకాంత్ వర్మ ఆధర్యంలో కొండల ప్రాంతంలోని పంట పొలాలను పరిశీలించారు. ఇప్పటివరకు 33శాతం పంట నష్టం జరిగిందని వారు తెలిపారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల ప్రజలు ఉన్నారు.


పొలాలను పరిశీలిస్తున్న అధికారులు


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న శ్రీనివాసాచార్యులు

గ్రంథాలయాన్ని వినియోగించుకోవాలి

ప్రజాశక్తి- లావేరు

ప్రాథమికస్థాయి నుండి విద్యార్థులు గ్రంథాలయంలో చదివి విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని రిసోర్స్ పర్సన్ ఆరవెల్లి శ్రీనివాసాచార్యులు అన్నారు. దసరా సెలవుల సందర్భంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో గురువారం విద్యార్థులకు పుస్తకాలు చదివితే విజ్ఞానం, సెల్ ఫోన్ వాడటం వల్ల అనర్థాలపై తెలిపారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు, సహాయకులు ఎ.గడ్డియ్య, విద్యార్థులు పాల్గొన్నారు.


పరామర్శిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ విజయ

జెడ్‌పి చైర్‌పర్సన్ పరామర్శ

ప్రజాశక్తి- కవిటి

మండల వైస్ ఎంపిపి పూడి నేతాజీ మామయ్య, శిలగాం గ్రామానికి చెందిన బల్లెడ ఆనందబాబు ఆనారోగ్యంతో ఇటీవల మరణించారు. విషయం తెలుసుకున్న జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ గురువారం ఆనందబాబు కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఈమెతో పాటు ఎంపిపి ప్రతినిధి కడియాల ప్రకాష్, వైస్ ఎంపిపి పూడి నేతాజీ, జగతి సర్పంచ్ పూడి ప్రసాదరావు పాల్గొన్నారు.

సిఎం చిత్రపటానికి పాలాభిషేకం

ప్రజాశక్తి- నందిగాం

నందిగాం గ్రామ పంచాయతీలో జగనన్న చేదోడు పథకం లబ్ధిదారులు సర్పంచ్ జడ్యాడ రమణమ్మ అధ్యక్షతన, సచివాలయ కన్వీనర్ల మండల ఇంచార్జ్ జడ్యాడ జయరాం ఆధ్వర్యంలో సిఎం జగన్మోహన్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. వరుసగా నాలుగో ఏడాది అర్హులైన రజక, నాయి బ్రాహ్మణ, టైలర్లకు ఏటా రూ.10వేలు చొప్పున సాయం చేస్తుండడంతో పాలాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో నందిగాం-1 ఎంపిటిసి అంబోది విష్ణు, పంచాయతీ సెక్రెటరీ లత, సచివాలయ కన్వీనర్ మోహనరావు, వెల్ఫేర్ అసిస్టెంట్లు రామకృష్ణ, నిరంజన్, వాలంటీర్లు, లబ్ధిదారులు పాల్గొన్నారు.


సిఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న లబ్ధిదారులు